

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



నవంబర్ 5 గురువారం 2026 | సంపుటి : 18 | సంచిక : 270 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

THURSDAY NOVEMBER 5 2026 | VOL:18 | ISSUE: 270 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు: కేటీఆర్ ఘాటు విమర్శలు

కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ ఘాటు విమర్శలు

కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ, బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు

తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చిందని అమిత్ షాను ప్రశ్నించిన కేటీఆర్

రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు



కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు.అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు

(మిగతా 2వ పేజీలో..)

కండక్టర్ ప్రవీణిక కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం: మంత్రి పొన్నం

ప్రయాణికురాలి దాడిలో గాయపడిన మహిళా కండక్టర్ ప్రవీణిక మృతి

మృతురాలి తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పొన్నం హామీ

ఉస్మానియా మార్చురీ వద్ద ప్రవీణిక మృతదేహానికి నివాళి అర్పించిన మంత్రి

ప్రయాణికురాలి దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన టీజీఎస్ఆర్టీసీ మహిళా కండక్టర్ గుండ్ల ప్రవీణిక (24) కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున కలిపి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రవీణిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవీణిక మృతదేహానికి మంత్రి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రవీణిక కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద అక్టోబర్ 25న ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. టికెట్ డబ్బుల చిల్లర విషయమై ప్రయాణికురాలు మౌనికతో జరిగిన గొడవలో... ప్రవీణికను కదులుతున్న బస్సు నుంచి కిందకు తోసేయడంతో ఆమె వెనుక చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. పది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న రాత్రి ఆమె కన్నుమూశారు. ఈ ఘటనపై ఇప్పటికే నిందితురాలైన ప్రయాణికురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి: కవిత

చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ ఇస్తున్నారన్న కవిత

నదీ జలాల వినియోగంపై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని విమర్శ

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని సూచన



పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో

(మిగతా 2వ పేజీలో..)

కేసీఆర్‌కు పేరు వస్తుందనే నీళ్లివ్వడం లేదు: వేముల ప్రశాంత్ రెడ్డి

మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం

ప్రస్తుత కరవు ప్రభుత్వ సృష్టేనని ఆరోపించిన వేముల ప్రశాంత్‌రెడ్డి

వెంటనే నీటిని విడుదల చేయకపోతే రైతు పోరుబాట తప్పదని హెచ్చరిక



తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్నది కాలం తెచ్చిన కరవు కాదని, ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిపెట్టిన కరవని ఆయన విమర్శించారు. పలువురు బీఆర్ఎస్ మాజీ

(మిగతా 2వ పేజీలో..)

"డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా".. ఎన్నికల ఫలితాలతో స్వరం మార్చిన ట్రంప్

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు ఘోర పరాజయం

హౌస్, సెనెట్ రెండింటినీ కైవసం చేసుకున్న డెమోక్రాట్లు

ఫలితాల తర్వాత దిగొచ్చిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఓటర్లు రిపబ్లికన్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పారు. ఎన్నికల ఫలితాలకు ముందు వరకు డెమోక్రాట్లు ప్రవేశపెట్టే ప్రతీ బిల్లును వీటో చేస్తానని గర్జించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఘోర పరాజయం తర్వాత అనూహ్యంగా స్వరం మార్చారు. దేశ శ్రేయస్సు కోసం డెమోక్రాట్లతో కలిసి పనిచేయడానికి సిద్ధమని ప్రకటించారు. "ఈ ఎన్నికల్లో నేను బ్యాలెట్‌పై లేను, ఒకవేళ ఉండుంటే మేము భారీ మెజారిటీతో గెలిచేవాళ్లం" అని వ్యాఖ్యానించారు ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు అంచనాలకు మించి ప్రతినిధుల సభ (హౌస్), సెనెట్ రెండింటినీ కైవసం చేసుకోవడంతో ట్రంప్ ఈ మేరకు దిగిరాక తప్పలేదు.ఎన్బీసీ న్యూస్ అంచనాల ప్రకారం, 435 స్థానాలున్న

(మిగతా 2వ పేజీలో..)

ఏపీలో మేయర్, ఛైర్‌పర్సన్‌ల ప్రమాణ స్వీకారం ఎప్పుడంటే..!

ఈ నెల 23న ఏపీలోని మేయర్లు, ఛైర్‌పర్సన్ల ప్రమాణ స్వీకారం

ధికారికంగా తేదీని ఖరారు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం అ

13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలకు కొత్త పాలకవర్గాలు

డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నికపై ఇంకా స్పష్టత రాని వైనం

ప్రత్యక్ష ఎన్నికల నేపథ్యంలో కొత్త

నిబంధనలు జారీ చేయనున్న ఎస్ఈసీ

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ముగిసిన పురపాలక ఎన్నికల ప్రక్రియలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలోని నూతనంగా ఎన్నికైన మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌ల ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 23న వారు తమ బాధ్యతలను

(మిగతా 2వ పేజీలో..)



తమిళ సినీ పరిశ్రమకు సీఎం విజయ్ ప్రభుత్వం గుడ్ న్యూస్.. ఇకపై రోజుకు 6 షోలు!

తమిళనాడులో కొత్త సినిమాలకు రోజుకు 6 షోలకు అనుమతి

రిలీజైన మొదటి వారం పాటు వర్తించనున్న కొత్త నిబంధన

సీఎం జోసెఫ్ విజయ్ అధ్యక్షతన ప్రభుత్వం కీలక ఉత్తర్వుల జారీ

సినీ సంఘాల విజ్ఞప్తి మేరకు నిబంధనలను సవరించిన సర్కార్

ప్రభుత్వ నిర్ణయంపై తమిళ సినీ పరిశ్రమ హర్షం



తమిళ సినీ పరిశ్రమకు అక్కడి ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది.

(మిగతా 2వ పేజీలో..)

సోషల్ మీడియాలో కాదు.. దమ్ముంటే సభలో చర్చకు రండి: రాహుల్‌కు నిర్మల సవాల్

మోదీ బహిరంగ చర్చకు రావాలన్న గాంధీ

ఘాటుగా స్పందించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని స్పష్టీకరణ

సమాధానాలు వినకుండా సభ నుంచి వాకౌట్ చేయడంపై విమర్శలు

ఆధారాలతో చర్చకు వచ్చి, ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని సూచన



బహిరంగ చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిద్ధమా?

అంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని, సోషల్ మీడియా కాదని తేల్చిచెప్పారు.

(మిగతా 2వ పేజీలో..)

విజయకేరటం
తెలుగు దినపత్రిక

సం పా ద కీయం

ప్రజాస్వామ్యానికి ప్రాణం.. స్వతంత్ర జర్నలిజం

అధికారం ప్రశ్నలను ఇష్టపడకపోవచ్చు.. కానీ ప్రజాస్వామ్యం మాత్రం ప్రశ్నలతోనే బలపడుతుంది. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, పాలకుల నిర్ణయాలను విశ్లేషించడం, అవినీతిని ప్రశ్నించడం, అణగారిన వర్గాల గొంతుకగా నిలవడం మీడియా బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చినప్పుడే జర్నలిజానికి నిజమైన గౌరవం లభిస్తుంది.ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా మీడియాకు ప్రత్యేక స్థానం ఉంది. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలతో పాటు ప్రజల తరఫున ప్రశ్నించే శక్తిగా పత్రికా రంగం నిలుస్తుంది. అయితే నేటి పరిస్థితుల్లో జర్నలిజం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. రాజకీయ ఒత్తిళ్లు, ఆర్థిక ప్రయోజనాలు, యాజమాన్యాల ప్రభావం, తప్పుడు ప్రచారాలు వార్తా స్వేచ్ఛకు పరీక్షగా మారుతున్నాయి.ప్రజలకు ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియజేయాల్సిన బాధ్యత మీడియాపై ఉంది. కానీ కొన్ని సందర్భాల్లో వార్తల కంటే సంచలనాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. వాస్తవాలను పరిశీలించకుండా ప్రచారం చేయడం, వ్యక్తిగత విమర్శలను వార్తలుగా చూపించడం, నిర్ధారణ కాని ఆరోపణలకు ప్రాధాన్యం ఇవ్వడం వృత్తి విలువలను దెబ్బతీస్తున్నాయి. వేగం కోసం పోటీపడే క్రమంలో నిజానిజాల నిర్ధారణను విస్మరించడం ప్రమాదకరం.మరోవైపు, ప్రజా సమస్యలపై నిష్పక్షపాతంగా కథనాలు రాసే జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే విలేకరులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వంటి సదుపాయాలు అందని పరిస్థితులు ఉన్నాయి. వార్తల సేకరణ కోసం సొంత ఖర్చులతో ప్రయాణాలు చేస్తూ, సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న ఎంతోమంది జర్నలిస్టుల జీవన పరిస్థితులు అందోళనకరంగా ఉన్నాయి. వారి సమస్యలను పరిష్కరించాల్సిన యాజమాన్యాలు, ప్రభుత్వాలు, జర్నలిస్టు సంఘాలు మరింత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది.ప్రజాస్వామ్యానికి స్వతంత్ర మీడియా ఎంత అవసరమో, మీడియాకు స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా అంతే అవసరం. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం ప్రతిపక్షాలకే పరిమితం కాదు. ప్రజల తరఫున మీడియా కూడా ప్రశ్నించాలి. అదే సమయంలో వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో కాకుండా ఆధారాలు, వాస్తవాల ఆధారంగా వార్తలు ప్రచురించాలి. విమర్శకు, వ్యక్తిగత దూషణకు మధ్య ఉన్న తేడాను గుర్తించాలి.సోషల్ మీడియా విస్తరణతో ప్రతి ఒక్కరికీ సమాచారం పంచుకునే అవకాశం వచ్చింది. అయితే అదే వేదికపై తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలు వేగంగా వ్యాపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో విశ్వసనీయమైన పత్రికలు, బాధ్యతాయుతమైన జర్నలిస్టుల అవసరం మరింత పెరిగింది. వార్తను ప్రచురించే ముందు పరిశీలించడం, సంబంధిత వర్గాల అభిప్రాయాలు తెలుసుకోవడం, తప్పులు జరిగితే సరిదిద్దుకోవడం మీడియా విశ్వసనీయతకు పునాది కావాలి.జర్నలిజం అనేది కేవలం వార్తల ప్రచురణ కాదు.. సమాజానికి దిశానిర్దేశం చేసే బాధ్యత. పేదలు, కార్మికులు, రైతులు, మహిళలు, అణగారిన వర్గాల సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే మీడియా తన సామాజిక బాధ్యతను నెరవేర్చినట్లవుతుంది. అధికారాన్ని ప్రశ్నించే కలం భయపడకూడదు. అదే సమయంలో ఆ కలం నిజాయితీని కోల్పోకూడదు.ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. విమర్శను స్వీకరించడం, తప్పులను సరిదిద్దుకోవడం, నిజాలను గౌరవించడం పాలనకు బలాన్నిస్తాయి. స్వేచ్ఛాయుతమైన, బాధ్యతాయుతమైన జర్నలిజం ఉన్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్ఠంగా ఉంటుంది. కలం ప్రజల పక్షాన నిలవాలి.. నిజం వైపు నడవాలి.. సమాజ హితం కోసం నిరంతరం పనిచేయాలి.

సోషల్ మీడియాలో కాదు.. దమ్ముంటే సభలో చర్చకు రండి: రాహుల్‌కు నిర్మల సవాల్

మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె వరుస పోస్టులు చేశారు."రాహుల్ జీ, చర్చకు వేదికను ఎంచుకోమని మీరు ప్రధానిని కోరుతున్నారు. దానికి ఇప్పటికే ఒక వేదిక ఉంది, అదే పార్లమెంట్. దానికి మీరే ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు" అని నిర్మల పేర్కొన్నారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఈవీఎంల పనితీరుపై చర్చించేందుకు పార్లమెంటులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేద్దామని హోంమంత్రి అమిత్ షా సోమవారమే ప్రతిపాదించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. "సోషల్ మీడియాలో సవాళ్లు విసిరినంత ఉత్సాహం పార్లమెంటులో చర్చకు ఎందుకు చూపించడం లేదు?" అని ఆమె ప్రశ్నించారు.ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు సభ నుంచి వాకౌట్ చేస్తున్నారని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. "సమాధానాలు డిమాండ్ చేసేటప్పుడు, వాటిని వినే బాధ్యత కూడా ఉంటుంది. ఎన్నోసార్లు మీరు, మీ పార్టీ సభ్యులు ప్రభుత్వం స్పందిస్తున్న సమయంలోనే సభ నుంచి వాకౌట్ చేశారు. అలాంటప్పుడు చర్చకు అంత ఆసక్తిగా ఉన్నామని ఎలా చెప్పుకుంటారు?" అని ఆమె నిలదీశారు.ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతున్నాయని ఆమె విమర్శించారు. "మీకు చర్చపై నిజంగా అంత ఆసక్తి ఉంటే, ముందు పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగేలా సహకరించవచ్చు కదా?" అని ప్రశ్నించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నివాసంలో నిర్వహించిన "మాక్ పార్లమెంట్" కార్యక్రమాన్ని కూడా ఆమె తప్పుబట్టారు. అది "మాక్ పార్లమెంట్" కన్నా "పార్లమెంటును అపహాస్యం చేయడం"లా ఉందని ఎద్దేవా చేశారు.ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడేవారు ముందుగా ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని హితవు పలికారు. "'దరో మత్' (భయపడొద్దు) అని మీరు అంటుంటారు కదా. అలాంటప్పుడు వాస్తవాలతో, ఆధారాలతో సభకు రండి, విమర్శలను ఎదుర్కోండి, సమాధానాలు వినడానికి కూర్చోండి" అని రాహుల్ గాంధీకి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు.

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు: కేటీఆర్ ఘాటు విమర్శలు

మొదటి పేజీ తరువాయి)

కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు.అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లుగా.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

పోలవరం–బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి: కవిత

మొదటి పేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని, ఈ విషయం ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాలతో మరోసారి బహిర్గతమైందని ఆమె విమర్శించారు.ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో రాష్ట్ర అధికారులు గోదావరి – కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ నుంచి చేపట్టాలని కోరుతుంటే... మరోవైపు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కవిత ఆరోపించారు.ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని, 2024లోనే తెలంగాణ జాగృతి తరఫున తాము దీనిని వ్యతిరేకించామని గుర్తుచేశారు. "రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు 'గురుదక్షిణ'గా చెల్లించుకుంటున్నారు" అని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు.ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని కవిత హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం జరిపే అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ తక్షణమే వైదొలగాలని, ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వెంటనే లేఖ రాయాలని ఆమె డిమాండ్ చేశారు.

కేసీఆర్‌కు పేరు వస్తుందనే నీళ్లివ్వడం లేదు: వేముల ప్రశాంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలతో కూడిన ప్రతినిధి బృందం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించింది. ఈ సందర్భంగా బ్యారేజీ స్థితిగతులను, నీటి లభ్యతను వారు పరిశీలించారు.అనంతరం వేముల ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. బ్యారేజీ వద్ద పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఉద్దేశపూర్వకంగా సముద్రం పాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యం సుమారు 22,000 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందని, ఈ నీటిని పంపింగ్ చేస్తే రైతుల పంటలను కాపాడవచ్చని ఆయన అన్నారు.బ్యారేజీ కూలిపోయిందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, 85 పిల్లర్లు పటిష్ఠంగానే ఉన్నాయని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటిని ఎత్తిపోయకపోతే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పెద్ద ఎత్తున 'రైతు పోరుబాట' నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తమిళ సినీ పరిశ్రమకు సీఎం విజయ్ ప్రభుత్వం గుడ్ న్యూస్.. ఇకపై రోజుకు 6 షోలు!

మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని థియేటర్లలో కొత్తగా విడుదలయ్యే తమిళ చిత్రాలకు రోజుకు ఆరు షోలు ప్రదర్శించుకునేందుకు అనుమతి ఇస్తూ ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా విడుదలైన మొదటి వారం రోజుల పాటు ఈ వెసులుబాటు ఉంటుందని ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ ఆరు షోలను ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున 2:30 గంటల మధ్య ప్రదర్శించుకోవచ్చని తెలిపింది.గత కొంతకాలంగా తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్, తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, తమిళనాడు థియేటర్ అండ్ మల్టీప్లెక్స్ ఓనర్స్ అసోసియేషన్ వంటి పలు సినీ సంఘాలు ప్రభుత్వానికి ఈ మేరకు విజ్ఞప్తి చేస్తున్నాయి. కొత్త సినిమాలకు తొలి వారంలో ప్రేక్షకుల ఆదరణ ఎక్కువగా ఉంటుందని, ఈ సమయంలో షోల సంఖ్య పెంచడం వల్ల పరిశ్రమకు, థియేటర్ల యజమానులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని వారు తమ అభ్యర్థనలో పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తులపై సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరమే సీఎం జోసెఫ్ విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నారు.వాస్తవానికి 1957 నాటి తమిళనాడు సినిమాస్ (రెగ్యులేషన్) నిబంధనల ప్రకారం రాష్ట్రంలో రోజుకు కేవలం నాలుగు షోలకు మాత్రమే అనుమతి ఉండేది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సినీ పరిశ్రమ కోరిక మేరకు, కొత్త సినిమాలకు మొదటి వారం రోజులు, అలాగే పండుగలు, ప్రభుత్వ సెలవు దినాలు, శని, ఆదివారాల్లో రోజుకు ఐదు షోలకు అనుమతి ఇచ్చింది. ఇప్పుడు దానిని మరో అడుగు ముందుకు వేసి ఆరు షోలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.కొత్త సినిమాలకు విడుదలైన మొదటి వారం మాత్రమే కాకుండా, స్థానిక పండుగ రోజులు, ప్రభుత్వ సెలవులు, వారాంతాల్లో (శని, ఆదివారాలు) కూడా రోజుకు ఆరు షోలు ప్రదర్శించుకోవచ్చని ప్రభుత్వం తన ప్రకటనలో వివరించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంపై తమిళ సినీ పరిశ్రమకు చెందిన నిర్మాతలు, పంపిణీదారులు, థియేటర్ల యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి పరిశ్రమకు అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

"డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా".. ఎన్నికల ఫలితాలతో స్వరం మార్చిన ట్రంప్

మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు 256 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. అదేవిధంగా, 100 మంది సభ్యులున్న సెనెట్‌లో కనీసం 54 స్థానాలు దక్కించుకుని స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించారు. ధరలు తగ్గిస్తానని, ప్రజల జీవితాలను సులభతరం చేస్తానని 2024 ఎన్నికల్లో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన ట్రంప్, ఆ తర్వాత ఆ హామీలను పక్కనపెట్టారు. అమెరికాను గొప్పగా మార్చేందుకు టారిఫ్‌లు విధించడం, ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు కోసం యుద్ధానికి దిగడం, వైట్‌హౌస్ సుందరీకరణ వంటి భారీ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఇవే ఆయన పట్ల ప్రజాగ్రహానికి కారణమయ్యాయి.రిపబ్లికన్లకు కంచుకోటలైన టెక్సాస్, కాన్సాస్, దక్షిణ కరోలినా వంటి రాష్ట్రాల్లో పార్టీ ఓటమి పాలుకావడం ఆయన అంచనాలను తీవ్రంగా దెబ్బతీసింది. కాన్సాస్‌లో 95 ఏళ్ల రిపబ్లికన్ల గుత్తాధిపత్యానికి తెరదించుతూ డెమోక్రాట్ అభ్యర్థి ఆడమ్ హామిల్టన్ సెనెటర్‌గా గెలిచారు. టెక్సాస్ గవర్నర్‌గా హినా హినోజోసా ఎన్నికవడంతో 36 ఏళ్ల రిపబ్లికన్ పాలనకు ముగింపు పడింది. ట్రంప్ స్వయంగా ఎంపిక చేసిన అభ్యర్థులు సైతం ఓడిపోవడం ఆయనకు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బ.ఈ ఓటమితో పార్టీపై ట్రంప్ పట్టు సడలుతుందని, ఆయనను వ్యతిరేకించే వారి సంఖ్య పెరుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధ్యక్షుడిగా మిగిలిన రెండేళ్లలో ఆయన దూకుడుకు కళ్లెం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఫలితాల తర్వాత 'పొలిటికో'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "రెండేళ్ల పాటు ప్రతీదాన్నీ వీటో చేస్తూ కూర్చోవాలని నేను అనుకోవడం లేదు. దేశానికి మంచి జరిగేలా చూసేందుకు డెమోక్రాట్లతో కలిసి పనిచేస్తాం" అని తెలిపారు.అయితే, డెమోక్రాట్లు మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతినిధుల సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్న హకీమ్ జెఫ్రీస్ మాట్లాడుతూ, "మేము కీలకమైన మార్పులు తీసుకురావాల్సి ఉంది. ఇప్పుడున్న వ్యవస్థలు సరిగా లేవు. అమెరికా ప్రజలకే ప్రాధాన్యత ఇచ్చే కాంగ్రెస్ కావాలి" అని స్పష్టం చేశారు. దీంతో రాబోయే రెండేళ్లలో ట్రంప్ పాలన ఎలా సాగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

ఏపీలో మేయర్, ఛైర్‌పర్సన్‌ల ప్రమాణ స్వీకారం ఎప్పుడంటే..!

మొదటి పేజీ తరువాయి)

అధికారికంగా స్వీకరించనున్నారని ఎస్ఈసీ స్పష్టం చేసింది.రాష్ట్రవ్యాప్తంగా 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీల్లో ఎన్నికల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ప్రజలు నేరుగా తమ నగర సారథులను ఎన్నుకోవడంతో, గెలుపొందిన అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేసేందుకు ఎస్ఈసీ తేదీని ఖరారు చేస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో కొత్త పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం కానుంది.అయితే, డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్‌ల ఎన్నికపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ పదవుల ఎన్నికకు సంబంధించిన తేదీలు, విధివిధానాలపై ఎస్ఈసీ నుంచి ప్రత్యేకంగా ప్రకటన వెలువడాల్సి ఉంది. గతంలో ఈ పదవులను పరోక్ష పద్ధతిలో కౌన్సిలర్లు ఎన్నుకునేవారు. అయితే, ఇప్పుడు మేయర్లు, ఛైర్‌పర్సన్ల ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరిగినందున, డిప్యూటీ పదవుల ఎన్నిక ప్రక్రియకు సంబంధించి ఎస్ఈసీ కొత్త మార్గదర్శకాలను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.నవంబరు 23న మేయర్లు, ఛైర్‌పర్సన్‌లు బాధ్యతలు చేపట్టినప్పటికీ, పూర్తిస్థాయి పాలకవర్గాల ఏర్పాటుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఎస్ఈసీ నుంచి తదుపరి ఆదేశాలు వెలువడిన తర్వాతే డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్‌ల ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అప్పటివరకు ఈ అంశంపై ఉత్కంఠ కొనసాగనుంది.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

నవంబర్ । గురువారం । 5 । 2026

ఎల్ నినోను ఎదుర్కొనేందుకు సమష్టి కార్యాచరణ చేపట్టాలి





● నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి -- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

నల్గొండ, నవంబర్ 4 (విజయ కెరటం):

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. బుధవారం నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్స్‌లో నిర్వహించిన ఎల్ నినో అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, వ్యవసాయం, విద్యుత్, పశుసంపద, భూగర్భ జలాలు, ఆహారం, కూలీల ఉపాధి వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందేలా అవగాహన కల్పించాలని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. తుఫాను ప్రభావంతో కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోకుండా వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. వచ్చే సీజన్లలో సన్నధాన్యం సాగును ప్రోత్సహించాలని, రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. గ్రామాల్లో రహదారుల నిర్మాణం, పశుగ్రాసం కొరత నివారణ, ఆయిల్ పామ్ సాగుపై అవగాహన, నీటి వృథా నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్, జనవరి నుంచి ఎల్ నినో ప్రభావం మరింత తీవ్రం అయ్యే అవకాశముందని, బోర్లు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. రైతులు యాసంగిలో వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని, భూగర్భ జలాలను కాపాడుకోవాలని కోరారు.ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. తాగునీరు, పశుగ్రాసం, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అవసరమైతే అద్దె బోర్ల ద్వారా నీటిని అందించడంతో పాటు, ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ మట్టి రహదారులు, పొలాలకు వెళ్లే దారుల నిర్మాణం ద్వారా కూలీలకు ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల పనులు పూర్తి చేసి చెరువులను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి వనరుల లభ్యతను ముందుగానే అంచనా వేసి, ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, వాననీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, పశుగ్రాసం పెంపునకు కార్యాచరణ రూపొందించాలని పిలుపునిచ్చారు.

ఎల్ నినోపై ప్రత్యేక కంట్రోల్ రూమ్

ఎల్ నినో పరిస్థితులపై ప్రజలకు సమాచారం అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ 18004251442తో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జలసిరి బతుకమ్మపై రూపొందించిన వీడియో సీడీని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాటల ద్వారా ఎల్ నినోపై ప్రజలకు అవగాహన కల్పించారు.

విదేశీయులకు వసతి కల్పిస్తే ఫార్మ్-III నమోదు తప్పనిసరి

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు: ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ: విజయ కెరటం ప్రతినిధి.

భారతదేశానికి వచ్చే విదేశీ పౌరులకు వసతి కల్పించే హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, పీజీలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, హోమ్‌స్టేలు, ప్రైవేట్ ఇళ్ల యజమానులు తప్పనిసరిగా ఇమ్మిగ్రేషన్ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. విదేశీ అతిథుల రాకపోకల వివరాలను నిర్ణీత సమయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వసతి కల్పించే వారి చట్టబద్ధమైన బాధ్యత అని స్పష్టం చేశారు.

24 గంటల్లోగా ఆన్‌లైన్ నమోదు

ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్-2025లోని సెక్షన్ 8 ప్రకారం విదేశీ పౌరులకు వసతి కల్పించే వారు వారి రాక, నిష్క్రమణ వివరాలను ఫార్మ్-III (గతంలో ఫార్మ్-జ) ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. విదేశీ అతిథి వచ్చిన 24 గంటల్లోగా వివరాలు సమర్పించడంతో పాటు, ఆ రికార్డులను ఏడాది పాటు భద్రపరచాలి. ఈ నిబంధనలు వర్తించే విదేశీ పౌరులు, ఓసీఐ కార్డుదారులు, నేపాల్, భూటాన్ పౌరుల విషయంలోనూ సంబంధిత నిబంధనలు పాటించాలని సూచించారు.

అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి

వసతి నిర్వాహకులు https://indianfrro.gov.in వెబ్‌సైట్ ద్వారా ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని, అవసరమైన వివరాలు సమర్పించి, సంబంధిత కార్యాలయం నుంచి లాగిన్ వివరాలు పొందాలి. అనంతరం విదేశీ అతిథుల వివరాలను నిర్ణీత గడువులోగా నమోదు చేయాలని ఎస్పీ తెలిపారు.

ఉల్లంఘనలకు కఠిన చర్యలు

విదేశీ పౌరుల వివరాలను సకాలంలో నమోదు చేయకపోవడం, చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, వీసా లేకుండా వసతి కల్పించడం, నకిలీ ప్రయాణ పత్రాలను ఉపయోగించడం, వీసా గడువు ముగిసినా దేశంలో కొనసాగడం వంటి ఉల్లంఘనలకు సంబంధిత చట్టాల ప్రకారం జరిమానాలు, క్రిమినల్ ప్రాసిక్యూషన్‌తో పాటు ఇతర చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



విదేశీ పౌరులూ నిబంధనలు పాటించాలి

భారతదేశంలో నివసిస్తున్న విదేశీ పౌరులు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, వీసా కలిగి ఉండాలని, వీసా నిబంధనలకు అనుగుణంగా నివసించాలని సూచించారు. చిరునామా మార్పు, పాస్‌పోర్ట్ లేదా వీసా పోగొట్టుకున్న సందర్భాల్లో సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. విద్యార్థులు కూడా తమ వీసా నిబంధనలు పాటిస్తూ విద్యాసంస్థలు, కోర్సుల మార్పులకు సంబంధించిన వివరాలను అవసరమైన విధంగా అప్‌డేట్ చేయాలని పేర్కొన్నారు. విదేశీ పౌరులకు వసతి కల్పించే యజమానులు, నిర్వాహకులు ఈ నిబంధనలపై అవగాహన పెంచుకుని సకాలంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కోరారు. నిబంధనలు పాటించడం ద్వారా అనవసరమైన చట్టపరమైన ఇబ్బందులను నివారించుకోవచ్చని తెలిపారు.

అవునూరి రాజు సంతాప సభకు హాజరైన ఎర్రబెల్లి

హనుమకొండ నవంబర్ 4 విజయ కెరటం ప్రతినిధి

ఇటీవల ఉర్సు బైపాస్ రోడ్ లోనీ తాళ్ళ పద్మావతి కళాశాల వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన రియల్ ఎస్టేట్ ఏజెంట్ అవునూరి రాజు సంతాప సభకు హాజరై పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించిన బి జె పి నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేడల ప్రసాద్.ఈ సందర్భంగా ప్రదీప్ రావు మరియు ప్రసాద్ లు మాట్లాడుతూ... ఉర్సు బైపాస్ రోడ్లో ప్రమాదాలు జరగడం నిత్య కృత్యంగా మారిందని... గత పది సంవత్సరాలలో వందల కొద్ది ప్రజలు రోడ్డు ప్రమాదాలలో మరణించారని, వరంగల్ కు ఎయిర్ పోర్ట్ వస్తుందని ప్రభుత్వ ప్రకటనలతో గ్రేటర్ వరంగల్ లో ప్రయాణికుల రద్దీ పెరిగిశీదని, కానీ పెరిగిన ట్రాఫిక్ కు అనుగుణంగా రోడ్లు వెడల్పు చేయక పోవడం వల్ల మరియు రోడ్డు పైననే భారీ లారీలు, వాహనాలు పార్కింగ్ చేస్తూ ఉండడం వల్ల నిత్యం ప్రమాదాల సంఖ్య పెరిగి ప్రాణ నష్టం జరుగుతున్నదని ఇప్పటికయినా రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మరియు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా చీనూ× స్పందించి గ్రేటర్ వరంగల్ లో రోడ్లు విస్తరించాలని, ట్రాఫిక్ పోలీసులు కూడా స్పందించి రోడ్ల పైనే పార్కింగ్ చేసే వాహనాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.అవునూరి రాజు కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో పెరుమాండ్ల లక్ష్మణ్, సిలువేరు నగేష్, బక్కీ రవి, మడూరి అశోక్, మోడెమ్ రాజేందర్ గౌడ్, నిమ్మల సదానందం, అపరాధి సారంగ పాణి, అవునూరి కృష్ణ మూర్తి, అవునూరి కుమార స్వామి, అవునూరి రామన్న, అవునూరి రామ్మూర్తి తదితరులు ఉన్నారు.



బుల్లెట్ ట్రైన్ కారిడార్ను జాతీయ రహదారికి సమాంతరంగా సూర్యాపేట మీదుగా ఏర్పాటు

● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన ధర్మార్జున్

హైదరాబాద్ (విజయ కెరటం స్టేట్ బ్యూరో గౌస్)



కేంద్ర ప్రభుత్వం శంషాబాద్ హబ్ గా తెలంగాణ నుండి వివిధ రాష్ట్రాలకు ఏర్పాటుకు ప్రకటించిన మూడు రైల్వే కారిడాలలో ఒకటిగా శంషాబాద్ టు చెన్నై వయా అమరావతి రైల్వే కారిడార్ ను జాతీయ రహదారి 65 కు సమాంతరంగా సూర్యాపేట మీదుగా అలైన్మెంట్ రూపొందించాలని సూర్యాపేటలో స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం రాత్రి తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జ్ ధర్మార్జున్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. సూర్యాపేట ప్రాంతశీ ఆధునిక అభివృద్ధి కి రైలు మార్గం అనేది కీలకమైన అవసరమని సూర్యాపేట జిల్లా కేంద్రం రెండు రాష్ట్ర రాజధానుల మధ్య కేంద్రంగా చుట్టూ ఎనిమిది జిల్లాలకు కూడలిగా విద్యా, వ్యాపార, వైద్య పరంగా అభివృద్ధి చెందుతూ ఉన్నదని. ట్రాన్స్పోర్ట్ రంగం మొత్తం కేవలం జాతీయ రహదారి మీదనే ఆధార పడడం మూలంగా ఇంకా ముందుకు దూసుకు వెళ్లలేక పోతున్నది. మరోవైపు రోజు వేలాదివాహనాలు ఈ రహదారి పై ప్రయానిస్తూ న్నవి. రోడ్డు ప్రమాదాలతో రోడ్ బెర్రర్ ఎదురుకుంటున్న పరిస్థితి వున్నది. దాదాపు నలుబై సంవత్సరాలనుండి రైలు మార్గం కోసం ఈ ప్రాంత ప్రజలు పోరాడుతున్నారు. ఈ పరిస్థితి లో కేంద్ర ప్రభుత్వం ప్రకటిశీచిన బుల్లెట్ రైలు కారీడార్ ను మొదటి సర్వే ప్రకారం సూర్యాపేట మీదుగానీ? ఏర్పాటు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు

టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సమావేశం

హైదరాబాద్ (విజయ కెరటం స్టేట్ బ్యూరో గౌస్)



హైదరాబాదులోని బిహెచ్ఈఎల్ లోని హోటల్ శుభంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు విరహత అలీ అధ్యక్షత వహించగా ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, కార్యదర్శి రామనారాయణ, యూనియన్ జాతీయ నాయకులు కుంజేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కోలా నాగేశ్వరరావు,బంటు కృష్ణ పాల్గొన్నారు.6 గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో ఇళ్ల స్థలాలు హెల్త్ కార్డులు అంశాలపై చర్చ జరిగింది పోరాటాలకు కార్యాచరణ తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు అక్రిడేషన్ కార్డుల మంజూరి విషయాల్లో సమావేశం సంతృప్తిని వ్యక్తం చేసింది కార్యదర్శి నివేదికపై సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ హర్షం వ్యక్తం చేసింది.

ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు

బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఆరు బఫర్ గోదాంల హమాలీలకు లేబర్ కార్డులు ఇప్పిస్తాం

కోదాడ (విజయ కెరటం స్టేట్ బ్యూరో గౌస్)



గోదాంలలో బియ్యం నిల్వ, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కోదాడ సమీపంలోని బాలాజీనగర్ ఎస్‌డబ్ల్యూసీ గోదాంను జిల్లా కలెక్టర్, ఎస్పీ కె. నరసింహ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. గోదాంలోని బియ్యం నిల్వలను, నిర్వహణ తీరును పరిశీలించారు. స్టాక్ రికార్డులను తనిఖీ చేయడంతో పాటు బియ్యం శాంపిల్స్ సేకరించి నాణ్యత పరీక్షలు చేయించారు. పరీక్ష ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసే సన్న బియ్యాన్ని జాగ్రత్తగా నిల్వ చేయాలని సూచించారు. బియ్యం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని గోదాం మేనేజర్, టెక్నికల్ అసిస్టెంట్లకు స్పష్టం చేశారు. నిల్వ చేసే విధానం, భద్రతా ప్రమాణాలు, ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఎఫ్ఐఎఫ్ఓ) పద్ధతిని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.హమాలీలకు లేబర్ కార్డులు అనంతరం గోదాంలో పనిచేస్తున్న హమాలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమకు లేబర్ కార్డులు ఇప్పించాలని వారు కోరగా కలెక్టర్ వెంటనే స్పందించారు. సంబంధిత లేబర్ అధికారితో మాట్లాడి జిల్లాలోని ఆరు బఫర్ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలందరికీ లేబర్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీల ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో హమాలీలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తాసిల్దార్ సంతోష్ కిరణ్ ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ సందీప్, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్ రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఊరట.. పత్తి ధరలో స్వల్ప పెరుగుదల!

వరంగల్, నవంబర్ 04, విజయ కెరటం :



రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని మార్కెట్ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక అనిల్ కుమార్ అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల శ్రమకు తగిన గౌరవం, పంటకు తగిన ధర దక్కేలా మార్కెట్ యంత్రాంగం బాధ్యతగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పత్తి ధర స్వల్పంగా పెరిగింది. క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.8,800 ధర పలకగా, జెండా పాట కూడా అదే ధరతో ప్రారంభమైంది. మార్కెట్‌కు సుమారు 3,800 బస్తాల పత్తి అమ్మకానికి వచ్చింది. కనిష్ఠ ధర రూ.6,500, మోడల్ ధర రూ.8,600గా నమోదైంది. ధరలో స్వల్ప పెరుగుదల కనిపించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి.మిర్చి మార్కెట్‌కు సుమారు 1,800 బస్తాలు రాగా, వండర్ హాట్ రకం గరిష్ఠంగా రూ.32,500, తేజా రకం రూ.22,600, 341 రకం రూ.26,500 ధర పలికాయి. పసుపు గరిష్ఠ ధర రూ.17,089గా నమోదైంది.రైతుల కష్టాన్ని ఆసరాగా చేసుకుని ఎవరైనా తక్కువ ధరలకు పంటలు కొనుగోలు చేయాలని ప్రయత్నిస్తే సహించేది లేదని, మార్కెట్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హెచ్చరించారు. రైతులు దళారుల బారిన పడకుండా నేరుగా మార్కెట్‌కు వచ్చి తమ పంటలను విక్రయించుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో మార్కెట్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు.మార్కెట్ కార్యదర్శి నిషా శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం పత్తి క్వింటాల్ ధర రూ.8,800గా నమోదైంది. మంగళవారం రూ.8,790గా ఉన్న ధర స్వల్పంగా పెరిగింది. తేజా మిర్చి ధర రూ.22,600గా నమోదై, గత రోజు రూ.23,000తో పోలిస్తే తగ్గింది. 341 రకం మిర్చి రూ.26,500, వండర్ హాట్ రకం రూ.32,500గా పలికాయి. టమాట మిర్చి ధర క్వింటాల్‌కు రూ.43,000కు చేరింది. గత రోజు రూ.41,000గా ఉండగా, రూ.2,000 పెరిగింది. 341, వండర్ హాట్ రకాల ధరల్లో పెద్దగా మార్పు లేదని కార్యదర్శి తెలిపారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

బడి మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలి





- పిల్లల ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలి -- కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 4 (విజయ కెరటం):

జిల్లాలో బడి మానేసిన పిల్లలను గుర్తించి, వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, యూనిసెఫ్ ప్రతినిధి ఫిలిప్‌తో కలిసి బాలల సంరక్షణ, సంక్షేమం మరియు బలోపేతంపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వివిధ కారణాలతో విద్యార్థులు మధ్యలోనే చదువు మానేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలకు హాజరుకాని పిల్లలను గ్రామాల వారీగా గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్య ప్రాముఖ్యతను వివరించాలన్నారు.బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల కారణంగా చదువుకు దూరమైన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో తిరిగి చేర్పించాలని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలపై ఆసక్తి ఉన్న పిల్లలను ఆయా రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యను కొనసాగించేలా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రమాదకర వృత్తుల్లో, ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న పిల్లలను గుర్తించి వారికి రక్షణ, పునరావాసం, విద్యతో పాటు అవసరమైన సహాయం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బాలల సంరక్షణ కమిటీలను బలోపేతం చేసి, బాలల సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విద్యార్థులు చెడు మార్గాల వైపు వెళ్లకుండా సక్రమమైన మార్గంలో నడిచేలా చూడాలని అన్నారు.యూనిసెఫ్ ప్రతినిధి ఫిలిప్ మాట్లాడుతూ బాలల సంరక్షణ, హక్కుల పరిరక్షణ కోసం 'యువ నేస్తం' కార్యక్రమం రక్షణ కవచంలా పనిచేస్తుందని తెలిపారు. చెడు మార్గాల్లోకి వెళ్తున్న పిల్లలను గుర్తించి, వారికి తగిన సూచనలు చేస్తూ పునరావాసం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, అదనపు ఎస్పీ రమేష్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లావణ్య, డీఈఓ సుసింధర్ రావు, డీఐఈఓ దస్రు నాయక్, డీపీఓ తరుణ్ చక్రవర్తి, డీవైఎస్ఓ అక్బర్ అలీ, ఆర్‌సీఓలు, డీసీఓ, సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బ రూపకు ఘన నివాళులు

నల్గొండ, నవంబర్ 4 (విజయ కెరటం):



రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నల్గొండ పట్టణంలోని బండారు గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. దుబ్బ రూప చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కండక్టర్ ప్రవళిక మృతి పట్ల మంత్రి కోమటిరెడ్డి దిగ్భ్రాంతి

- బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది.. ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి

నల్గొండ, నవంబర్ 4 (విజయ కెరటం):



మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రవళిక పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద గత నెల 25న చిల్లర విషయంలో జరిగిన గొడవలో ప్రవళిక తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఈ ఘటన పట్ల మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

హుజూర్ నగర్ రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న డబల్ బెడ్ రూమ్ మోడల్ కాలనీ పరిశీలన

జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్

సూర్యాపేట (విజయ కెరటం స్టేట్ బ్యూరో గౌస్)





హుజూర్ నగర్ డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణ పనుల్లో ఏమైనా చిన్న చిన్న లోపాలు ఉన్నా వెంటనే రెక్టిఫై చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఇండ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హుజూర్ నగర్ రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీ ఇండ్లను ఎస్పీ కే నరసింహతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల మంత్రి ఆదేశాల మేరకు హౌసింగ్ యూనిట్లలోని ప్రతీ బ్లాక్‌ను కలెక్టర్ ప్రత్యక్షంగా బుధవారం పరిశీలించారు. ఇండ్లలో ఉన్న చిన్న చిన్న లోపాలను గుర్తించి, ఆ లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత కాంట్రాక్టర్లు,అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇండ్లతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతంశ్రీ చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమీషనర్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నల్లగొండ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

- పాల్గొననున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. రూ.30.50 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నల్లగొండ, నవంబర్ 4 (విజయ కెరటం):



నల్లగొండ జిల్లా కేంద్రంలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ కార్యక్రమాల్లో పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.ఉదయం 10 గంటలకు ఇందిరా భవన్‌లోని క్యాంపు కార్యాలయానికి చేరుకోనున్న మంత్రి, 10.45 గంటలకు నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన బైరెడ్డి హేమలత వెంకట్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతారు.అనంతరం ఉదయం 11 గంటలకు రూ.17.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న సమీకృత మండల స్థాయి కార్యాలయాల సముదాయానికి శంకుస్థాపన చేస్తారు. 11.15 గంటలకు మామిళ్లగూడ మీదుగా కతాల్‌గూడ నుంచి రాజీవ్ స్వగృహ వరకు రహదారి అభివృద్ధి పనులకు సుమారు రూ.13 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేయనున్నారు.మొత్తం రూ.30.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులతో జిల్లా అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర కేబినెట్ సమావేశంలో పాల్గొనేందుకు మంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయానికి చేరుకోనున్నారు.

తిప్పర్తిలో సబ్‌జూనియర్ బాలుర కబడ్డీ జట్టు ఎంపికలు

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి -- కబడ్డీ అసోసియేషన్

తిప్పర్తి, నవంబర్ 4 (విజయ కెరటం):



నల్గొండ జిల్లా సబ్‌జూనియర్ బాలుర కబడ్డీ జట్టు జిల్లా స్థాయి ఎంపికలు తిప్పర్తిలోని పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు.ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12వ తేదీ నుంచి వికారాబాద్ జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో నల్గొండ జిల్లా తరఫున పాల్గొననున్నారు.ఈ సందర్భంగా నల్గొండ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు భూలోకరావు, కార్యదర్శి కర్తవ్య మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేసి రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తిప్పర్తి మండల విద్యాధికారి నర్సింహా నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ రెడ్డి, డొమినిక్, మిర్యాలగూడ లీల హాస్పిటల్ చైర్మన్ చైతన్య రాజ్, షాహిద్, అన్వార్, కొండల్, మురళి, తస్లీమ్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎన్. లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు పలువురు అభినందనలు తెలియజేసి రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

అవినీతి అంతం -- DYFI పంతం

47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ, నవంబర్ 4 (విజయ కెరటం):



డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (DYFI) 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లగొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన "అవినీతి అంతం -- DYFI పంతం" పోస్టర్‌ను బుధవారం DYFI కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ DYFI మాజీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, పట్టణ అధ్యక్షుడు పాలది కార్తీక్, కార్యదర్శి గుండాల నరేష్ తదితరులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న అవినీతి, అక్రమాలు, అన్యాయాలకు వ్యతిరేకంగా యువత చైతన్యవంతమై పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజ మార్పు కోసం DYFI చేస్తున్న కృషి, ఆశయాలు, లక్ష్యాలను యువతలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణం, యువత హక్కుల సాధన, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ణ్ఖీ× పోరాటాలను మరింత ఉధృతం చేయాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో DYFI పట్టణ కమిటీ అధ్యక్షుడు పాలది కార్తీక్, కార్యదర్శి గుండాల నరేష్, మాజీ నాయకులు దండంపల్లి సత్తయ్య, కొండ వెంకన్న, సలపరాజు సైదులు, జిల్లా అంజయ్య, అశోక్, నాగయ్య, మల్లేశం, పట్టణ నాయకులు గద్దపాటి రఘువరన్, వేణు, గుణాలపూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలు విజయవంతం..

జిల్లా బృందానికి కలెక్టర్, ఎస్పీ అభినందనలు

నల్గొండ, నవంబర్ 4 (విజయ కెరటం):



సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా గుజరాత్‌లో నిర్వహించిన రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకల్లో నల్గొండ జిల్లా నుంచి ఎంపికైన 15 మంది సభ్యుల బృందం విజయవంతంగా పాల్గొంది. ఈ సందర్భంగా జిల్లా బృందానికి కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.జిల్లా కలెక్టర్, ఎస్పీ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేల సూచనల మేరకు వివిధ రంగాలకు చెందిన 15 మందిని ఎంపిక చేసినట్లు నోడల్ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో గుజరాత్‌లో జరిగిన రాష్ట్రీయ ఏక్తా దివస్ పరేడ్‌లో బృందం పాల్గొని, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సాంస్కృతిక శకటాలను తిలకించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించడంతో పాటు, స్టాచ్యూ ఆఫ్ యూనిటీని సందర్శించింది.తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు డీజీ, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ బృందం కార్యక్రమ నిర్వహణలో కీలక సహకారం అందించింది. జిల్లా నుంచి బస్సుల ఏర్పాటు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణ సౌకర్యం, భోజన వసతి, తాగునీరు తదితర ఏర్పాట్లు చేశారు. రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రత్యేక ఆహ్వానితుల కోసం వైద్య బృందాలను సైతం అందుబాటులో ఉంచారు.తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, వేడుకల్లో విజయవంతంగా పాల్గొన్న 15 మంది సభ్యులను కలెక్టర్, ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528